భూపాలం - ఆది

అదివో అల్లదివో - హరి వాసము
పదివేల శేషుల - పడగలమయము

అదె వేంకటాచల - మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల - కపురూపము
అదివో నిత్యనివాస - మఖిలమునులకు
అదె చూడుడదె మ్రొక్కు - డానందమయము

చెంగట నల్లదివో - శేషాచలము
నింగినున్న దేవతల - నిజవాసము
ముంగిట నల్లదివో - మూలనున్న ధనము
బంగారు శిఖరాల - బహు బ్రహ్మమయము

కైవల్యపదము వేం - కటనగమదివో
శ్రీవేంకటపతికి - సిరులయినది
భావింప సకల సం - పద రూపమదివో
పావనములకెల్ల - పావనమయము

అన్నమాచార్యులు శ్రీవేంకటగిరిని పొడగని, భక్తిపారవశ్యంతో, భావపారమ్యంతో పలికిన పదమిది. శ్రీవేంకటగిరి వైకుంఠంగా, ఏడుకొండల నిమ్నోన్నత శిఖరాలు అనంతుని మణిఫణాళిగా గోచరించాయి ఆ పరమభాగవతునికి.

అత్యున్నతమైన వేంకటాచలము, బ్రహ్మాదులకు సైతం అపురూపమై, అలవి కానిది. మునులందరికీ నెలవు ఇది. ఈ శేషాచలమే దేవతలందరికీ నివాసస్థలం. ముందరే ఉన్నది ఈ కొండపైన తిరుమందిరంలో దాగిన పెన్నిధి ఈ వేంకటగిరి బంగారు శిఖరాలు పలుబ్రహ్మల శిలాకారాలు. ఐశ్వర్యమంతా క్రోడించి, ప్రోదిచేసి ముద్దయై, శ్రీ వేంకటేశ్వరునికి, శ్రీనివాసునికి నివాసమైన శ్రీనివాసమిది. పరమపావనమైనది. పావనకరమైనది. ఇదే కైవల్యపదం. దర్శించండి - సాష్టాంగ దండప్రణామాలు ఆచరించండి అని భక్త సక్త ప్రపంచానికి ఈ ఉద్గాత సంగీత సందేశం సంకీర్తనగా సంతరించారు సంకీర్తనాచార్యులు.

'వేం కటతీతి వేంకటః - వేం పాపాన్ని కటతి - త్రుంచేది అని వేంకటశబ్దార్థం. పాప నాశనం చేసే ఈశ్వరుడు శ్రీవేంకటేశ్వరుడు. శ్రీ వేంకటేశ్వర స్మరణ దర్శనాదులచే నరులు దురితదూరులౌతారు.

యస్య స్మరణ మాత్రేణ జన్మ సంసార బంధనాత్
విముచ్యతే జగస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే

ఓం నమోవిష్ణవే ప్రభవిష్ణవే అని విష్ణు సహస్ర నామస్తోత్రం. ఎవ్వని స్మరించినంత మాత్రాన జన్మ సంసారాదిబంధాల నుండి విముక్తి లభిస్తుందో అట్టి విష్ణునికి, తనకుతానై ఆవిర్భవించే స్వయంభవిష్ణునికి ప్రణవపూర్వక నమస్కారం అని భావం. శ్రీమహావిష్ణువే శ్రీ వేంకటేశ్వరుడు.